క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పెడన: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర అన్నారు. మంగళవారం ఇండియన్ స్వచ్ఛతా లీగ్ ప్రోగ్రాంలో భాగంగా యూత్ వర్సెస్ గార్బేజ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులు, ఎన్విరాన్మెంట్ అండ్ శానిటేషన్ సెక్రటరీలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



కృత్తివెన్ను: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వైద్యాధికారులు అన్నారు. యండపల్లి సచివాలయ పరిధిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించి ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 5వ తేదీన చెరుకుమిల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. నిడమర్రు సచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక అనఘాష్టమి వ్రతం



నాగాయలంక: గ్రామంలోని ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో తొమ్మిదోరోజు మంగళవారం మండల దత్త భక్త బృందం సౌజన్యంతో సామూహిక అనఘాష్టమి వ్రతం వైభవంగా జరిగింది. శనగపల్లి వెంకట్రావు బ్రహ్మత్వంలో నంబూరి నాగరాజు, నంబూరి జగన్ మోహనరావు సతీ సమేతంగా పీటలపై కూర్చున్నారు. సామూహిక వ్రత పూజల్లో 60 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం సబ్బినేని బోసు ఆర్థిక సౌజన్యంతో బొర్రా పద్మనాభశాస్త్రి (విజయవాడ) భాగవతార్ సుందర కాండ హరికథా గానం చేశారు. నిత్య కార్యక్రమంలో భాగంగా ప్రసన్న గణపతి ఆలయంలో, ఉత్సవ వేదికపై పూజలు జరిగాయి.

పృథ్వీశ్వరాలయానికి ఏసీ సమర్పణ

నడకుదురు(చల్లపల్లి): గ్రామంలోని ప్రాచీన దేవాలయం పృథ్వీశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు ఏసీ సమర్పించారు. పాత నడకుదురుకు చెందిన భక్తుడు కోళ్లపల్లి వెంకటేష్‌కు మెక్సికోలో ఉద్యోగం వచ్చింది. దీంతో వెంకటేష్ తన తల్లిదండ్రులు కోళ్లపల్లి వెంకటేశ్వరరావు-లక్ష్మి ద్వారా రూ.50 వేల విలువైన ఏసీని సర్పంచ్ గొరిపర్తి సురేష్ చేతుల మీదుగా వేద పండితులు మామిళ్లపల్లి పృథ్వీకి అందజేశారు.

డీఆర్వోను కలిసిన సురేష్‌బాబు



చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన పి. వెంకటరమణను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ నాయకులు తూము వెంకటేశ్వరరావు, మద్దాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

ప్రయాణికులు క్షేమం

కాసానగర్(మోపిదేవి): మండల పరిధి కాసానగర్ మలుపు వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రాణాలతో బయట పడ్డారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ సీహెచ్ పద్మ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పద్మ మాట్లాడుతూ చల్లపల్లి నుంచి మోపిదేవి వస్తున్న కారు కాసానగర్ వద్ద డివైడర్ దాటి 216 హైవే పైకి వస్తుండగా మచిలీపట్నం నుంచి అవనిగడ్డ వైపు వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో కారు బోల్తాపడి బాగా దెబ్బతిందని చెప్పారు. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు క్షేమంగా బయట పడ్డారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

నేర పరిశోధనలో నిఘా నేత్రం

- కీలకమైన కేసుల్లో పోలీసులకు సాయంగా సీసీ కెమేరాలు
- ప్రమాదాల సమయంలోనూ నిందితుల గుర్తింపు
- దొంగలను గుర్తించి పట్టించడంలో ప్రధాన పాత్ర



కృత్తివెన్ను ప్రధాన సెంటర్‌లో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమేరా



కృత్తివెన్ను పోలీస్‌స్టేషన్ కంట్రోల్ రూమ్‌లో సీసీ పుటేజీ పర్యవేక్షణ

కృత్తివెన్ను: ఆలయంలో వెండి కిరీటం చోరీకి గురైంది..రొయ్యల చెరువుల వద్ద లక్షలాది రూపాయల విలువైన మేత కట్టలు మాయమైపోతున్నాయి.. జ్యూవెలరీ షాపులో వెండీ, బంగారం దోచుకుపోయారు ఇలాంటి వార్తలు కృత్తివెన్ను మండల పరిసర ప్రాంతాల్లో తరచూ వింటున్నాం. గతంలో చోరీ జరిగిన తరువాత దొంగలు దొరకడం, చోరీకి గురైన వస్తువులు రికవరీ చేయడం అసాధ్యంగా ఉండేది. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో దొంగలు దొరికిపోతున్నారు. కృత్తివెన్ను పోలీసుల చొరవ, దాతల దాతృత్వంతో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలు దొంగలను పట్టించడంలో కీలకంగా మారాయి. వీటి సాయంతో ఇప్పటికే మండలంలో జరిగిన ఎన్నో చోరీ కేసులను పోలీసులు ఛేదించడంతో పాటు, దొంగలను పట్టుకున్నారు.

సీసీ కెమేరాలతో కీలక సమాచారం

తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో దాదాపు 25 కిలోమీటర్ల మేర 216 జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. దీంతో ఈ ప్రాంతం ఎంతగా అభివృద్ధి చెందిందో అంతే స్థాయిలో ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారి నిర్మాణంతో రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దొంగతనాల జోరు కూడా పెరిగింది. దొంగలను గుర్తించడంతో పాటు ప్రమాద సమయంలో వాహనదారుల తప్పులను తెలుసుకోవడం కోసం రహదారి వెంబడి ప్రధాన కూడళ్లలోనూ, గ్రామాలలోని దేవాలయాలు, పాఠశాలలు, రద్దీ ప్రాంతాల్లోనూ సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు అవే ప్రతి కేసులోనూ కీలకమైన సమాచారాన్ని అందిస్తున్నాయి.

చోరీ కేసులో రికవరీలు ఇలా..

చుట్టుపక్కల పది మండలాల్లో నిత్యం రొయ్యల మేతను దొంగిలిస్తూ తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని సుమారు ఏడాదిన్నర కిందట కృత్తివెన్ను మండలంలో సీసీ కెమేరాల సాయంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని గరశపూడి వద్ద రొయ్యల మేత కట్టలను దొంగిలించగా రోడ్డుపై ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలో గుర్తించి దొంగను అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ. 5 లక్షల విలువైన మేతకట్టలను స్వాధీనం చేసుకున్నారు.

- లక్ష్మీపురం వద్ద జ్యూవెలరీ షాపులో జరిగిన చోరీలో నిందితులను గుర్తించి వారి నుంచి ఏడు కిలోల వెండి, 20 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు.
- గరిశపూడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఏడు కిలోల వెండి ప్రతిమను స్వాధీనం చేసుకున్నారు.
- ఒంటిళ్ల గ్రామం నుంచి చోరీకి గురైన ట్రాక్టర్‌ను సీసీ కెమేరాల సాయంతో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.
- 2022లో కృత్తివెన్నులో యువకుని ప్రమాదం కేసుపై హత్య కేసుగా పుకార్లు రావడంతో సీసీ కెమేరా పుటేజీ ఆధారంగా అది హత్య కాదు యాక్సిడెంట్ అని రుజువు చేశారు.
- రహదారిపై కొన్నిసార్లు వాహనాలు ఢీ కొట్టి వెళ్లిపోవడంతో ఆ వాహనాలను గుర్తించి బాధితులకు న్యాయం చేయడంలోనూ సీసీ కెమేరాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

140 చోట్ల సీసీ కెమేరాలు



ఈ ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో గుర్తుతెలియని వాహనాలు ఢీ కొట్టి వెళ్లి పోతున్నాయి. ఇటువంటి సమయంలో బాధితులకు న్యాయం జరగడం లేదు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించి దాతలను ప్రోత్సహించి వారి సౌజన్యంతో మండల వ్యాప్తంగా 140 చోట్ల సీసీ కెమేరాలు ఏర్పాటు చేశాం. వీటి వల్ల దొంగతనాలు కూడా తగ్గాయి. దొంగతనం జరిగిన తరువాత ఎక్కువ శాతం సీసీ కెమేరాలను ఉపయోగించి దొంగలను పట్టుకుని వస్తువులు రికవరీ చేశాం.

– ఎ. గణేష్‌కుమార్, ఎస్ఐ కృత్తివెన్ను

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

నాక్సా ఎంపెడా సంస్థ రీజినల్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్



కోడూరు: ఆక్వా సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తి స్థాయిలో తగ్గిస్తే దిగుబడులు అధికంగా సాధించవచ్చని నాక్సా ఎంపెడా సంస్థ రీజినల్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక తొమ్మిదో వార్డులోని అంబేడ్కర్ హాల్‌లో సంస్థ ఫీల్డ్ మేనేజర్ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్సీలకు చెందిన ఆక్వా రైతులకు ప్రత్యేక శిక్షణ తరగతులు మంగళవారం కొనసాగాయి. ఆయన మాట్లాడుతూ రొయ్యల సాగులో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రొయ్యల వ్యాధులు, చికిత్సా విధానం, వ్యాధులు రాకుండా అనుసరించాల్సిన పద్ధతులను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. రొయ్య పిల్లలను హేచరీల్లో ఎంపిక చేసే సమయంలోనే తగిన జాగ్రత్తలు పాటించాలని, ఎరువులు, యాంటీ బయోటిక్స్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. నాక్సా సొసైటీ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు సబ్సిడీపై ఏరియేటర్స్, జనరేటర్లతో పాటు పలు చెరువుల పరికరాలను అందిస్తున్నామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చంద్రశేఖర్ కోరారు. బుధవారం కూడా శిక్షణ కొనసాగుతుందని ఫీల్డ్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. సంస్థ స్టేట్ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, కృష్ణా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుకూలంగా లేని చోట్ల పోలింగ్ కేంద్రాల మార్పు

నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రాజ్యలక్ష్మి

పెడన: పెడన నియోజకవర్గంలో అనుకూలంగా లేని ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్లను మార్పు చేశామని, వాటి వివరాలు మీకు అందించామని, వాటిల్లో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు వస్తాయని భావిస్తే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె పెడన తహసీల్దార్ కార్యాలయంలో పెడన నియోజకవర్గంలోని నలుగురు తహసీల్దార్లతో పాటు పెడన పురపాలక సంఘ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 216 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. వీటిల్లో ఆకులమన్నాడు, కోననారాయణపాలెం, నందమూరు, నందిగామ, పెదతుమ్మిడిలో రెండు, మలపరాజుగూడెం, నెహ్రూ నగర్ చోరంపూడి, లక్ష్మీపురంలో రెండు, చినపాండ్రక మొత్తం 11 చోట్ల మార్పులు చేశామన్నారు. అంగన్‌వాడీలు, ఆర్‌బీకేలు, నాడు–నేడుతో రూపుదిద్దుకున్న కొత్త పాఠశాలల్లో పోలింగ్ స్టేషన్లను పెట్టామని చెప్పారు. అంతకుముందు శిథిలావస్థకు చేరినవి, వెలుతురు సరిగ్గా లేనివాటి స్థానాల్లో వీటిని ఒకటికి రెండు సార్లు పూర్తి స్థాయిలో పరిశీలించి ఎంపిక చేశామన్నారు.
స్థానికంగా ఓటర్లకు పోలింగ్ స్టేషన్లు అందుబాటులో ఉంటే పోలింగ్ శాతం పెరుగుతుందన్న ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి అక్టోబర్ 27న ముసాయిదా జాబితాను విడుదల చేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పెడన పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, టీడీపీ నాయకుడు శలపాటి ప్రసాద్, తహసీల్దార్ మధుసూదనరావు, కృత్తివెన్ను, గూడూరు తహసీల్దార్లు రామకోటేశ్వరరావు, ప్రసాద్, ఎన్నికల డీటీ కల్పన, టీపీఓ ఏసుబాబు, సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గణనాథుని పందిళ్ల వద్ద అన్నసమారాధనలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని గణపతి నవరాత్రి ఉత్సవ పందిళ్ల వద్ద మంగళవారం అన్నసమారాధనలు నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద మీడియా మిత్రులు ఏర్పాటు చేసిన గణనాథుని పందిరి వద్ద అన్నసమారాధన నిర్వహించారు. వందలాది మంది భక్తులు విచ్చేసి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఖొజ్జిల్లిపేట ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న గణనాథుని పందిరి, జవ్వారుపేట సెంటర్‌లో గణనాథుని పందిరి, చల్లపల్లి బైపాస్‌రోడ్డులో కుమ్మరిగూడెం వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. స్వామివారి పందిళ్ల వద్ద ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక అలంకరణలు ఆకట్టుకున్నాయి. పలు పందిళ్ల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

మేయర్ వెంకటేశ్వరమ్మ



40వ డివిజన్‌లో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచి డివిజన్లను పరిశుభ్రంగా ఉంచాలని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. నగరంలోని 40వ డివిజన్ గొడుగుపేట, కాసానిగూడెం ప్రాంతంలో మంగళవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. ప్రతి వీధికి వెళ్లి పారిశుద్ధ్య పనులను, ఇతర సమస్యలను పరిశీలించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మేయర్ మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రజల నుంచి ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని సూచించారు. 40వ డివిజన్‌లో అధ్వానంగా ఉన్న పలు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ, పళ్లెం కల్యాణ్, తరకటూరు సీతారాముడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చల్లపల్లి: మాతాశిశు సంపూర్ణ ఆరోగ్యానికి చిరు ధాన్యాలు ప్రయోజనకరం అని పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు అన్నారు. మంగళవారం పోషణ అభియాన్ కార్యక్రమం సందర్భంగా పంచాయతీ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల భాగస్వామ్యంపై పంచాయతీలో అవగాహన సదస్సు నిర్వహించారు.

పినగూడూరులంకలో..

గూడూరు: స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పినగూడూరులంక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచి రాహెతున్నీసా మాట్లాడుతూ మహిళలు, గర్భిణులు, బాలింతలు పోషకాహార ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. పోషకాహార ప్రాముఖ్యతపై చైతన్యం తీసుకు వచ్చేందుకే ప్రభుత్వం పోషణ్ మహా కార్యక్రమం నిర్వహిస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జన్ను రేవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి

కోనేరుసెంటర్: బాలింతలు, గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ రూరల్ సూపర్‌వైజర్ బి. కృష్ణకుమారి అన్నారు. మండల పరిధిలోని చిన్నాపురం పంచాయతీ పరిధిలోని వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బంది బాలింతలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కృష్ణకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆకుకూరల పప్పును ఆహారంగా తీసుకోవడం ద్వారా రక్తహీనత తగ్గుతుందన్నారు. పాలు, గుడ్డు తీసుకోవడం ద్వారా శరీరానికి ప్రొటీన్లు అందుతాయని చెప్పారు. ఏఎన్ఎంలు అందించే కాల్షియం, ఐరన్ టాబ్లెట్‌లను గర్భిణులు తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుధ, ఆర్. శిరీష, కె. అంజలీదేవి, టి. రత్నకుమారి, కె. లక్ష్మీకుమారి, పి. విజయలక్ష్మి, ఎస్. విష్ణుకుమారి పాల్గొన్నారు.



పినగూడూరులంక కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు

ఎంపెడా అధికారులతో ఎంపీ బాలశౌరి సమావేశం



చిలకలపూడి(మచిలీపట్నం): బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి మంగళవారం ఎంపెడా అధికారులతో సమావేశమయ్యారు. కమిటీ స్టడీ టూర్‌లో భాగంగా పోర్టుబ్లెయిర్‌లో ఎంపెడా అధికారులతో సమావేశమై విధివిధానాలపై చర్చించారు. సమావేశంలో ఎంపెడా డైరెక్టర్ ఎంకే కార్తికేయన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తొలుత స్థానిక కలెక్టర్ నివేదిత, ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఓంప్రకాష్ మిశ్రాలు ఎంపీ బాలశౌరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

శిక్షణ తరగతుల పరిశీలన



మాట్లాడుతున్న అబ్దుల్‌గని

పెడన: బోధనలో మెలకువల కోసమే కాంప్లెక్సుల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధన చేయాలని రాష్ట్ర ఉర్దూ బోధన శాస్త్ర సహాయకులు షేక్ అబ్దుల్‌గని అన్నారు. మంగళవారం ఐదో వార్డులోని ఉర్దూ ప్రాథమిక బాలికల పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సముదాయ శిక్షణను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉర్దూ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఎండీ సాదతుల్లా, కృష్ణా జిల్లా సమగ్ర శిక్ష ఉర్దూ అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి జి. సీతామహలక్ష్మి, కాంప్లెక్స్ ఉపాధ్యాయిని హిదయతున్నీసా, కార్యదర్శి ఏఆర్ అస్లామ్, బంటుమిల్లి, కృత్తివెన్ను, గుడ్లవల్లేరు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- పెడనలోని పాఠశాలల్లో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను ఎంఈఓ–2 వైవీ హరనాథ్ పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఇంటి ముంగిటకే వైద్యసేవలు



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న వివేక్

కోడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతాయని వైద్యాధికారి వివేక్ అన్నారు. మంగళవారం ఉల్లిపాలెం గ్రామంలో సురక్ష కార్యక్రమానికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్యామిలీ డాక్టర్‌ను అనుసంధానం చేస్తూ సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. రోగి ఇంటి వద్దకే వచ్చి వైద్యసేవలను అందించనున్నట్లు వివేక్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 30న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఇది దోహదపడుతుందన్నారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. 104 సంచార వాహనంపై గ్రామస్తులకు వైద్య సేవలందించారు. 104 మచిలీపట్నం డివిజన్ ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ కాలారి శ్రీనివాస పెరుమాళ్లు, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఏఎన్ఎం కృష్ణవేణి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: భగవాన్ సత్యసాయిబాబా సేవా సంస్థ విద్యా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలకు మంచి స్పందన లభించిందని సంస్థ జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలోని 34 ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆచార్య దేవోభవ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 12 వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. మచిలీపట్నం నగరంలో 2 వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు తమ సంస్థ ప్రతినిధులు వెళ్లి వ్యాసరచన పోటీలు నిర్వహించారన్నారు. పోటీలకు సహకరించిన జిల్లా విద్యాశాఖాధికారి తాహెరాసుల్తానాకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీలను సత్యసాయి సేవా సంస్థ మచిలీపట్నం కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్, పి. వరప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



బంటుమిల్లి: పెందుర్రు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంటుమిల్లి కొత్త దళితవాడకు చెందిన నేతల ప్రేమ్‌కుమార్ మిలేష్ ఆక్వా కంపెనీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాల లైట్ల వెలుగులో కనిపించక ట్రాక్టరు ట్రక్కును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా రక్తస్రావమై స్పృహ కోల్పోయాడు. బాధితుడిని సహోద్యోగులు 108 వాహనంలో బందరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సమాచారం, సహ ఉద్యోగి గొరిసెట్టి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా ఐలమ్మ జయంతి వేడుకలు

కోడూరు: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చిట్యాల ఐలమ్మ 128వ జయంతి వేడుకలను బీసీ సేన ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో ఐలమ్మ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. బీసీ సేన జిల్లా అధ్యక్షుడు తిరుపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐలమ్మ చేసిన సేవలను వివరించారు. రజక వృత్తిదారులకు ఆమె జీవితం ఆదర్శనీయమని అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సేన మండల అధ్యక్షుడు కొండవీటి సురేష్, నేతలు అద్దంకి పాండురంగారావు, కొండవీటి రామకృష్ణ, అవనిగడ్డ శ్రీనివాసరావు, అద్దంకి కృష్ణ పాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్నకు చెబుదాం కార్యక్రమం గుడివాడ నియోజకవర్గ పరిధిలోని నందివాడ మండల కేంద్రంలో బుధవారం నిర్వహిస్తామని కలెక్టర్ పి. రాజాబాబు మంగళవారం తెలిపారు. నందివాడ మండల కేంద్రంలోని కొండపల్లి కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తనతో పాటు జిల్లా అధికారులందరూ హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి వచ్చిన అర్జీలను పరిష్కరిస్తామని చెప్పారు.

రేపు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశం

మచిలీపట్నంటౌన్: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు గెజిటెడ్ అధికారులుగా ప్రమోషన్లలో రిజర్వేషన్లను కాపాడుకునేందుకు సంబంధించి చర్చించేందుకు గురువారం మచిలీపట్నంలో సమావేశం నిర్వహిస్తామని ఏపీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ సంఘ నాయకులు కర్రా సునీల్‌కుమార్, మద్దాల కృష్ణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లకు సంబంధించిన నిబంధనలు అమలవుతున్నదీ, లేనిదీ ఈ సందర్భంగా చర్చిస్తామన్నారు. సమావేశానికి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు హాజరుకావాలని వారు కోరారు.

రూ. 86 వేలు పలికిన గణేష్ లడ్డూ



మచిలీపట్నం టౌన్: నగరంలోని బ్రహ్మపురం శ్రీ సాయిగణేష్ దేవాలయం వద్ద మంగళవారం గణనాథుని లడ్డూ వేలం నిర్వహించారు. లడ్డూను 9వ డివిజన్ కార్పొరేటర్ రామిశెట్టి వాణిశ్రీ, రమణ దంపతులు రూ. 86 వేలకు దక్కించుకున్నారు. 15 ఏళ్లుగా ఈ దంపతులు స్వామివారి లడ్డూను వేలంలో దక్కించుకోవడం విశేషం. అక్టోబర్ 5వ తేదీన ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

రేపు స్వామివారి హుండీ కానుకల లెక్కింపు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారికి హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను గురువారం ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో లెక్కిస్తామని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. ఆసక్తిగల భక్తులు డ్రెస్‌కోడ్‌లో లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని చెప్పారు. హుండీ కానుకల లెక్కింపు కారణంగా గురువారం స్వామివారి నిత్య శాంతి కల్యాణాన్ని ఉదయం 7 గంటలకే ప్రారంభిస్తామన్నారు.

పెదయాదరలో కేంద్ర బృందం పర్యటన

కోనేరుసెంటర్: కేంద్ర పంచాయతీరాజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ విజయ్‌కుమార్ బృందం బందరు మండలంలోని పెదయాదర గ్రామంలో పర్యటించింది. పెదయాదర గ్రామ పంచాయతీకి సంబంధించిన నిధులు దుర్వినియోగం అయినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఈ బృందం పెదయాదర గ్రామ పంచాయతీని సందర్శించింది. పంచాయతీరాజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ విజయ కుమార్ పంచాయతీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిధులు దుర్వినియోగం అయిందీ లేనిదీ పరిశీలించిన ఆయన పలు అంశాలపై పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ శాఖాధికారి పట్నాయక్, డీఎల్‌పీఓ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.